ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -150 పేజీలు - 04 వెల - 04/- బుధవారం 8 జులై 2026

## గోల్స్ కింగ్ వీడ్కోలు..

**ఫుట్‌బాల్‌లో రొనాల్డో శకం సమాప్తం**

**2026 వరల్డ్ కప్‌లో ఓటమితో అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలికిన రొనాల్డో**


**23 ఏళ్ల పాటు పోర్చుగల్ తరపున ఆడి, 18 ఏళ్లు కెప్టెన్‌గా జట్టును నడిపించిన దిగ్గజం**

**ఆరు ప్రపంచకప్‌లు, ఆరు యూరో ఛాంపియన్‌షిప్‌లలో ఆడిన ఏకైక ఆటగాడిగా చరిత్ర**

**అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ (146), అత్యధిక మ్యాచ్‌ల (233) ప్రపంచ రికార్డు**

**యూరో, నేషన్స్ లీగ్ ట్రోఫీలు గెలిచినా..**

**వరల్డ్ కప్ ట్రోఫీ కల నెరవేరలేదు**



2లో.

## భూములు ఇచ్చిన రైతులకు

# 40వేల కౌలు

**పదేళ్లపాటు అమలు చేయాలని నిర్ణయం**

**జనవరి 6లోగా రుణం తీసుకున్న వారికి రుణమాఫీ అమలు**

**ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరించని వారిపై భూసేకరణ కత్తి**

**ఇనాం భూముల కోసం దేవాదాయశాఖకు రూ.159 కోట్లు చెల్లింపు**

**చంద్రబాబు అధ్యక్షతన 63వ సీఆర్డీఏ సమావేశం లో కీలక నిర్ణయాలు**

**అమరావతిజూలై 7 ఆంధ్ర ప్రగతి**

సీఆర్డీఏ సమావేశంలో ఏపీ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. 2024 జూన్ నుంచి భూములిచ్చిన వారికి రూ.40వేలు కౌలు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. భూములు ఇచ్చినప్పటి నుంచి 10ఏళ్లపాటు ఇది అమలు కానుంది. గ్రామకంతాల్లో భూమి కోల్పోతున్న వారికి ఏటా రూ.10వేలు ఇచ్చేందుకు అనుమతిని ఇచ్చింది. కొత్తగా పూలింగ్ జరిగే గ్రామాల రైతులకు రుణమాఫీ చేయాలని నిర్ణయించింది. ఈ ఏడాది జనవరి 6లోగా రుణం తీసుకున్న వారికి ఈ మాఫీ అమలవుతుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన 63వ సీఆర్డీఏ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రెండో దశ పూలింగ్‌లో భూములిచ్చిన రైతుల గురించి చర్చించారు. రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు,**మిగతా 2లో...**



## ఎల్జీకి ఆహ్వానం





**విశాఖలో జీసీసీ, మూలపేటలో నాఫ్తా క్రాకర్..**

**ఏపీలో పెట్టుబడులకు ఎల్జీకి మంత్రి లోకేశ్ ఆహ్వానం**

**దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న మంత్రి లోకేశ్**

**ఎల్జీ ఎలక్ట్రానిక్స్, ఎల్జీ కెమ్ ఉన్నతాధికారులతో సమావేశం**

**ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చిన ఎల్జీ యాజమాన్యం**

**అమరావతిజూలై 7 ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన దక్షిణ కొరియా పర్యటనలో కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. పర్యటనలో భాగంగా ఆయన ప్రపంచ ప్రఖ్యాత సంస్థ ఎల్జీ ఎలక్ట్రానిక్స్, ఎల్జీ కెమ్ ఉన్నతస్థాయి**మిగతా 2లో...**



## సింగరేణికి మరో 2 బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు..

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటన -సింగరేణికి నైనీ కోల్ బ్లాక్**

**తాడిచెర్ల-2 బ్లాక్ కూడా కేటాయింపు**

**బొగ్గు ఉత్పత్తి పెంచాలని సూచన**

**న్యూఢిల్లీ,జూలై 7 ఆంధ్ర ప్రగతి**

సింగరేణికి మరో రెండు కీలక బొగ్గు బ్లాక్‌లు దక్కనున్నాయి. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌తో పాటు తాడిచెర్ల-2 కోల్ బ్లాక్‌ను కూడా సింగరేణికి కేటాయిస్తున్నట్లు కేంద్ర **మిగతా 2లో...**

## ఈ25 పెట్రోల్ తెచ్చే ప్రతిపాదన లేదు

**ఈ25 పెట్రోల్ పై కేంద్రం కీలక ప్రకటన**

**ఈ25 పెట్రోల్ పై వస్తున్న వదంతులను నమ్మవద్దని ప్రజలకు సూచన**

**వాహనాలపై ఈ25 అనుకూలతపై ఇంకా పరీక్షలు జరుగుతున్నాయని వెల్లడి**

**ఈ20 పెట్రోల్ పై మైలేజ్, ఇంజిన్ పనితీరుపై ప్రజల్లో నెలకొన్న ఆందోళనలు**

**దశలవారీగా, ఆచితూచి మాత్రమే ముందుకు వెళ్తామని ప్రభుత్వ హామీ**

**న్యూఢిల్లీ,జూలై 7 ఆంధ్ర ప్రగతి**

దేశవ్యాప్తంగా 25 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఈ25)ను త్వరలో ప్రవేశపెట్టనున్నట్లు వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అటువంటి ప్రతిపాదన ఏదీ ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ వదంతుల నేపథ్యంలో వాహనదారుల్లో నెలకొన్న ఆందోళనలను నివృత్తి చేసే **మిగతా 2లో...**





## పాతబస్తీలో ఓటర్ల నమోదుపై బీజేపీ అభ్యంతరం

**ఇంటింటి సర్వే జరపకుండా మజ్లిస్ శిబిరాల్లో ఫారాల పంపిణీ జరుగుతోందని ఆరోపణ**

**బీఎల్‌ఓలు నిబంధనలు పాటించడం లేదని ఈసీకి ఫిర్యాదు**

**తెలంగాణ సీఈఓ సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించిన బీజేపీ నేతలు**



## టెంపుల్ టూరిజం తరహాలో

# హస్తకళల పర్యాటకం

**కళాకారుల జీవితాలపై ప్రత్యేక డాక్యుమెంటరీలు రూపొందించాలని ఆదేశం**

**ఉప్పాడ చీరలు, అరటి నార వస్తువులు కొనుగోలు చేసిన పవన్**

**గోదావరి పుష్కరాల్లో తోలుబొమ్మలాట ప్రదర్శనలకు ప్రత్యేక ఏర్పాట్లు**

**విజయవాడ,జూలై 7 ఆంధ్ర ప్రగతి**

ఏపీ హస్తకళలను ప్రపంచ నలుమూలలకు తీసుకెళ్దామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మార్కెటింగ్ ఇంకా పెంచగలిగితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు.**మిగతా 2లో...**





## భోగాపురం సిద్ధం..

**విమానాశ్రయం త్వరలో ప్రారంభం**

**భోగాపురం విమానాశ్రయాన్ని సందర్శించిన రామ్మోహన్ నాయుడు**

**అన్ని పనులు పూర్తయ్యాయని తెలిపిన కేంద్ర మంత్రి**

**మోదీ సమయం ఖరారు చేస్తే ప్రారంభోత్సవం ఉంటుందని వెల్లడి**

**భోగాపురం జూలై 7 ఆంధ్ర ప్రగతి**

ఉత్తరాంధ్రలో కొత్త అభివృద్ధి చరిత్రకు నాంది పలుకుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం పూర్తి స్థాయికి చేరుకుంది. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు విమానాశ్రయాన్ని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలతో **మిగతా 2లో...**

## ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణులు..

**భారత్‌తో 200 మిలియన్ డాలర్ల డీల్**

**ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణులు విక్రయించేందుకు భారత్ ఒప్పందం**

**సుమారు రూ.1900 కోట్లతో డీల్**

**ఫిలిప్పీన్స్, వియత్నాం తర్వాత బ్రహ్మోస్ కొన్న మూడో దేశం ఇండోనేషియా**

**ఆస్త్రా క్షిపణులు, సాంకేతిక బదిలీపైనా కీలక ఒప్పందాలు**

**న్యూఢిల్లీ,జూలై 7 ఆంధ్ర ప్రగతి**

రక్షణ రంగ ఎగుమతుల్లో భారత్ మరో కీలక మైలురాయిని అధిగమించింది. ఇండోనేషియాకు సుమారు 200 మిలియన్ డాలర్ల (రూ.1,900 కోట్లు) విలువైన రెండు బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్యాటరీలను సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం ఇరు దేశాల **మిగతా 2లో...**



## గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

**2008 వరుస బాంబు పేలుళ్ల కేసులో 38మందికి ఉరి**

**మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధింపు**

**ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు**

**అహ్మదాబాద్,జూలై 7 ఆంధ్ర ప్రగతి**

దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక కోర్టు 2022లో విధించిన శిక్షలను సమర్థిస్తూ 38 మంది దోషులకు ఉరిశిక్షను, మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్షను హైకోర్టు మంగళవారం ఖరారు చేసింది.**మిగతా 2లో...**



# భోగాపురం సిద్ధం..

**మొదటి పేజీ తరువాయి**

జీఎంఆర్ సంస్థ షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేసిందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఇప్పటికే ఎయిరోడ్రోమ్ లైసెన్స్ వచ్చేసిందని వెల్లడించారు. ప్రధాని మోదీ సమయం ఖరారు చేస్తే వారి చేతుల మీదుగా ప్రారంభోత్సవ వేడుక ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. 78 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మితమైన టెర్మినల్ భవనం సంవత్సరానికి ఏకంగా నాలుగు కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యం కలిగి ఉంటుందని చెప్పారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, కళలు ఉట్టిపడేలా డిజైన్ చేయడంతో ఇది దేశంలోనే అత్యుత్తమ విమానాశ్రయాల్లో ఒకటిగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ప్రారంభం అయిన వారం లోపు విశాఖ విమానాశ్రయ కార్యకలాపాలను భోగాపురానికి మార్చి పూర్తి స్థాయిలో సేవలు ప్రారంభిస్తామని తెలిపారు.

# ఈ25 పెట్రోల్ తెచ్చే ప్రతిపాదన లేదు

**మొదటి పేజీ తరువాయి**

ప్రయత్నం చేసింది. ఈ25 ఇంధనాన్ని తక్షణమే అందుబాటులోకి తీసుకువస్తున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని కేంద్రం ఉద్ఘాటించింది. వివిధ వాహన మోడళ్లపై ఈ25 మిశ్రమం యొక్క అనుకూలతపై ప్రస్తుతం పరీక్షలు కొనసాగుతున్నాయని, పూర్తిస్థాయి నివేదికలు అందిన తర్వాతే దీనిపై విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఈ20 (20 శాతం ఇథనాల్) పెట్రోల్ సురక్షితమైనదని, అది సమర్థవంతంగా పనిచేస్తోందని వారు తెలిపారు.

ముడి చమురు దిగుమతులు తగ్గించడం, పర్యావరణ పరిరక్షణ, మరియు చెరకు రైతులను ఆదుకోవడం వంటి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే నిర్ణీత గడువు కంటే ముందే భారత్ ఈ20 లక్ష్యాన్ని చేరుకుంది. అయితే, ఈ20 పెట్రోల్ వాడకం వల్ల మైలేజీ తగ్గడం, పాత వాహనాల ఇంజిన్ల పనితీరు దెబ్బతినడం వంటి ఆందోళనలు సామాజిక మాధ్యమాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ25 వస్తుందనే వార్తలు వాహనదారుల్లో మరింత ఆందోళన రేకెత్తించాయి. ఇటీవల ప్రభుత్వం ఈ22 నుంచి ఈ30 వరకు ఇథనాల్ మిశ్రమాలపై ఎక్సైజ్ సుంకం మినహాయింపు ఇవ్వడంతో ఈ25 త్వరలోనే వస్తుందనే ఊహాగానాలు పెరిగాయి. అయితే, ఈ20 తర్వాత ఏ నిర్ణయం తీసుకున్నా అది దశలవారీగా ఉంటుందని, వాహన తయారీ సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం ఉంటుందని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ధృవీకరించని సమాచారాన్ని నమ్మి ఆందోళన చెందవద్దని కేంద్రం ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# సింగరేణికి మరో 2 బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు..

**మొదటి పేజీ తరువాయి**

బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఈ నిర్ణయం సంస్థ భవిష్యత్తుకు పెద్ద ఊరటనిస్తుందని చెప్పారు. ఢిల్లీలో మంగళవారం మాట్లాడిన కిషన్ రెడ్డి సింగరేణికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కేలా కేంద్రం చొరవ తీసుకుందని వెల్లడించారు. ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు బ్లాక్‌ల వేలంలోనూ సింగరేణి పాల్గొనేలా తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లో మరో 35 ఏళ్లకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని కిషన్‌రెడ్డి చెప్పారు. దీని వల్ల సింగరేణికి సుమారు రూ. 75 వేల కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. తెలంగాణలో లక్షలాది కుటుంబాల జీవనాధారం సింగరేణి అని పేర్కొన్నారు. తాడిచెర్ల-2 కోల్ బ్లాక్‌ను కూడా సింగరేణికే కేటాయించాలని కేంద్రం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ఈ బ్లాక్‌తో సంస్థ కార్యకలాపాలు మరింత బలోపేతం అవుతాయన్నారు. భవిష్యత్తులో ఉత్పత్తి పెరగడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు.

# పాతబస్తీలో ఓటర్ల నమోదుపై బీజేపీ అభ్యంతరం

**హైదరాబాద్,జూలై 7 ఆంధ్ర ప్రగతి**

హైదరాబాద్ పాతబస్తీలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని బీజేపీ ఆరోపించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డిని కలిసిన ఆ పార్టీ నేతలు ఫిర్యాదు చేశారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) క్షేత్రస్థాయిలో ఇంటింటికి తిరగడం లేదని, దానికి బదులుగా మజ్లిస్ పార్టీ నేతలు ఏర్పాటు చేసిన శిబిరాల ద్వారానే ఓటరు నమోదు ఫారాలను పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. కేవలం ఫారాల పంపిణీకే పరిమితం కాకుండా, పూర్తి చేసిన దరఖాస్తులను అప్‌లోడ్ చేసేందుకు వినియోగించే ఎన్నికల సంఘం అధికారిక యాప్‌ను సైతం మజ్లిస్ నేతలకే అప్పగిస్తున్నారని బీజేపీ తన ఫిర్యాదులో పేర్కొంది. పాతబస్తీతో పాటు జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, వరంగల్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో చాలామంది ఓటర్లకు కనీసం దరఖాస్తు ఫారాలు కూడా అందలేదని వివరించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఈ సందర్భంగా పలు అంశాలను సీఈఓ దృష్టికి తీసుకెళ్లింది. హైదరాబాద్‌లో కేవలం ఆంగ్ల భాషలో, జిల్లాల్లో తెలుగులో ఫారాలను పంపిణీ చేయడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చి స్థిరపడిన ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ఇంటింటి సర్వేను తప్పనిసరి చేయాలని, ఓటర్లు అందుబాటులో లేని పక్షంలో బీఎల్ఓలు కనీసం మూడుసార్లు వారి ఇళ్లను సందర్శించేలా ఆదేశాలు జారీ చేయాలని బీజేపీ విజ్ఞప్తి చేసింది. ఓటర్ల జాబితా సవరణ కోసం జూన్ 25న ప్రారంభమైన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ జూలై 24 వరకు కొనసాగనుంది. జూలై 31న ముసాయిదా జాబితాను, అక్టోబర్ 1న తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రచురించనుంది.

# ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణులు..

**మొదటి పేజీ తరువాయి**

మధ్య జరిగిన పలు కీలక రక్షణ ఒప్పందాల్లో భాగంగా ఈ డీల్ ఖరారైంది.

ఈ ఒప్పందంతో బ్రహ్మోస్ క్షిపణులను కొనుగోలు చేసిన మూడో విదేశీ కస్టమర్‌గా ఇండోనేషియా నిలిచింది. ఇప్పటికే 2022లో ఫిలిప్పీన్స్ మూడు బ్యాటరీల కోసం ఒప్పందం చేసుకోగా, ఈ ఏడాదే వియత్నాం కూడా బ్రహ్మోస్ కొనుగోలుకు అంగీకరించింది. తాజా ఒప్పందంతో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ తన రక్షణ భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది. ఈ డీల్ కేవలం బ్రహ్మోస్ క్షిపణులకే పరిమితం కాలేదు. ఆస్త్రా ఎయిర్-టు-ఎయిర్ క్షిపణి వ్యవస్థలు, కీలకమైన రక్షణ సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, సముద్ర భద్రత వంటి అంశాలపై కూడా ఇరు దేశాలు అంగీకారానికి వచ్చాయి. గత ఏడాది నవంబర్‌లో జరిగిన ఇరు దేశాల రక్షణ మంత్రుల సమావేశంలోనే ఈ ఒప్పందాలపై చర్చలు మొదలయ్యాయి. భారత్‌కు చెందిన డీఆర్‌డీవో, రష్యాకు చెందిన ఎన్పీవో మషినోస్ట్రోయెనియా సంయుక్తంగా బ్రహ్మోస్ క్షిపణిని అభివృద్ధి చేశాయి. ఇది భారత త్రివిధ దళాల్లోనూ సేవలందిస్తోంది. భారత్ మరో అరడజను దేశాలతో బ్రహ్మోస్ అమ్మకాలపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. సాధారణంగా ఒక బ్రహ్మోస్ బ్యాటరీలో 4 లాంచర్లు ఉంటాయి. ఒక్కో లాంచర్ పై 3 రెడీ టు ఫైర్ బ్రహ్మోస్ క్షిపణులు ఉంటాయి. ఆ లెక్కన ఒక బ్యాటరీలో మొత్తం 12 క్షిపణులు ఉంటాయి. వీటిని కేవలం 30 సెకన్ల వ్యవధిలోనే వేర్వేరు లక్ష్యాలపై ప్రయోగించవచ్చు.

# గోల్స్ కింగ్ వీడ్కోలు..

## ఫుట్‌బాల్‌లో రొనాల్డో శకం సమాప్తం

**న్యూఢిల్లీ,జూలై 7 ఆంధ్ర ప్రగతి**

ఒక శకం ముగిసింది. 23 ఏళ్లుగా ఒక దేశపు ఆశలను తన భుజాలపై మోసిన ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలికాడు. మంగళవారం జరిగిన 2026 ఫిఫా ప్రపంచకప్ రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో స్పెయిన్‌తో జరిగిన మ్యాచ్‌లో పోర్చుగల్ ఓటమి చెందడంతో రొనాల్డో అద్భుతమైన ప్రపంచకప్ ప్రస్థానం ముగిసింది. ఆరు ప్రపంచకప్‌లు, ఆరు యూరో ఛాంపియన్‌షిప్‌లు, దాదాపు రెండు దశాబ్దాల కెప్టెన్సీతో సాగిన ఈ అసాధారణ ప్రయాణానికి ఫుట్‌బాల్ ప్రపంచం మొత్తం సెల్యూట్ చేస్తోంది. రొనాల్డో తన అంతర్జాతీయ కెరీర్‌ను 2003 ఆగస్టు 20న, 18 ఏళ్ల వయసులో కజకిస్థాన్‌పై ఆడిన మ్యాచ్‌తో ప్రారంభించాడు. యూరో 2004లో గ్రీస్‌పై తన తొలి అంతర్జాతీయ గోల్‌తో ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. నాయకత్వ లక్షణాలను ముందుగానే గుర్తించిన మేనేజ్‌మెంట్, యూరో 2008 నాటికి అతడిని జట్టు కెప్టెన్‌గా నియమించింది. అప్పటి నుంచి దాదాపు 18 సంవత్సరాల పాటు ఆ బాధ్యతను ఎంతో గౌరవంగా నిర్వర్తించాడు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో రొనాల్డో ఫుట్‌బాల్ రికార్డు పుస్తకాలను తిరగరాశాడు. 2014లో పౌలెటా (47 గోల్స్)ను అధిగమించి పోర్చుగల్ తరపున ఆల్-టైమ్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 2021లో ఇరాన్ దిగ్గజం అలీ దాయిని దాటి పురుషుల అంతర్జాతీయ ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా ప్రపంచ రికార్డు సృష్టించాడు. జూన్ 2023 నాటికి 200 అంతర్జాతీయ మ్యాచ్‌ల మైలురాయిని దాటినా, అతని విజయదాహం ఏమాత్రం తగ్గలేదు. ప్రస్తుత ప్రపంచకప్‌లో ఉజ్బెకిస్థాన్‌పై గోల్ చేసి, ఆరు వేర్వేరు ప్రపంచకప్‌లలో గోల్ చేసిన తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. తన ప్రపంచకప్ కెరీర్‌ను మొత్తం 11 గోల్స్‌తో ముగించాడు. తద్వారా పోర్చుగల్ దిగ్గజం యూసెబియో (9 గోల్స్) రికార్డును అధిగమించాడు. 2006, 2010, 2014, 2018, 2022, 2026 ప్రపంచకప్‌లతో పాటు ఆరు యూరోపియన్ ఛాంపియన్‌షిప్‌లలో ఆడిన ఏకైక ఆటగాడిగా రొనాల్డో రికార్డుల్లో నిలిచాడు

# ఎల్జీకి ఆహ్వానం




**మొదటి పేజీ తరువాయి**

ప్రతినిధి బృందాలతో సియోల్‌లో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విశాఖపట్నం, శ్రీసిటీ, మూలపేట కేంద్రాలుగా రాష్ట్రంలో భారీ ప్రాజెక్టులు చేపట్టేందుకు గల అవకాశాలను ఆయన వివరించి, పెట్టుబడులకు ఆహ్వానం పలికారు.

**విశాఖలో జీసీసీ.. ఎల్జీ ఎలక్ట్రానిక్స్‌కు లోకేశ్ ప్రతిపాదనలు**

సియోల్‌లోని ఎల్జీ ట్విన్ టవర్స్‌లో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ గ్లోబల్ సీఈవో ల్యూ జె చెయోల్, ఇండియా సీఈవో హాంగ్ జు జియోన్‌లతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్జీ సంస్థ తన నోయిడా, బెంగళూరు ప్రాజెక్టుల తరహాలో విశాఖపట్నంలో ఒక గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) లేదా ఇంజనీరింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనితో పాటు శ్రీసిటీ, దాని పరిసర ప్రాంతాలలో డిస్‌ప్లే మాడ్యూల్స్, సెన్సర్లు, పవర్ ఎలక్ట్రానిక్స్ వంటి విడిభాగాల తయారీ యూనిట్‌ను స్థాపించే అవకాశాలను పరిశీలించాలని కోరారు.

రాష్ట్రంలో ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించేందుకు ఐఓటీ, రోబోటిక్స్ వంటి అత్యాధునిక రంగాలలో ఇన్నోవేషన్ ల్యాబ్‌ల ఏర్పాటుకు రీసెర్చ్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)తో కలిసి పనిచేయాలని సూచించారు. క్యారియర్ సంస్థ తరహాలో వాణిజ్య అవసరాల కోసం చిల్లర్ మాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

ఈ సమావేశంలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా సీఈవో హాంగ్ జు జియోన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం భారత రిఫ్రిజిరేటర్ మార్కెట్‌లో 28 శాతం, వాషింగ్ మెషీన్ల విభాగంలో 33.5 శాతం వాటాతో ఎల్జీ అగ్రస్థానంలో ఉందని తెలిపారు. ఇప్పటికే శ్రీసిటీలో రూ. 5,000 కోట్ల భారీ వ్యయంతో తమ మూడో ఉత్పాదక కేంద్రాన్ని నిర్మిస్తున్నామని, దీని ద్వారా సుమారు 1,500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు. ఈ ఏడాది చివరికల్లా ఈ యూనిట్‌లో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించి ఏసీ కంప్రెసర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు తయారు చేస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన తాజా ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

**మూలపేటలో నాఫ్తా క్రాకర్.. ఎల్జీ కెమ్‌కు ఆహ్వానం**

పర్యటనలో భాగంగా లోకేశ్, ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్-జు కోహ్ బృందంతో కూడా భేటీ అయ్యారు. కాకినాడ పోర్టు సమీపంలో పాలీస్టైరిన్ తయారీ కేంద్రాన్ని, మూలపేట పోర్టు కేంద్రంగా ప్రపంచ స్థాయి నాఫ్తా క్రాకర్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని కోరారు. ఎలక్ట్రిక్ వాహన రంగానికి ఊతమిచ్చేలా రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ క్యాథోడ్ యాక్టివ్ మెటీరియల్, సెల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. వీటితో పాటు మూలపేటలో బయో-ఇథనాల్, సస్టెయినబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ (ఎస్ఏఎఫ్) ఉత్పత్తిపై దృష్టి సారించి జీవ ఇంధనాల తయారీ కేంద్రం, ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్వినియోగంలోకి తెచ్చేందుకు రీసైక్లింగ్, పైరోలిసిస్ ప్లాంట్లను ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

దీనికి యున్-జు కోహ్ స్పందిస్తూ, గతంలో విశాఖపట్నం గోపాలపట్నంలోని ఎల్జీ పాలిమర్స్ ప్లాంట్ ద్వారా కీలకమైన పాలిమర్ భాగాలను సరఫరా చేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం శ్రీసిటీలో ఏబీఎస్ కాంపౌండ్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన నూతన ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశాలు రాష్ట్రానికి మరిన్ని భారీ పెట్టుబడులను ఆకర్షించే దిశగా సానుకూల వాతావరణాన్ని సృష్టించాయని అధికారులు భావిస్తున్నారు.

# గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

**మొదటి పేజీ తరువాయి**

ఈ కేసులో దాఖలైన అప్పీళ్లపై సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించింది 2008, జులై 26న అహ్మదాబాద్‌లో కేవలం 70 నిమిషాల వ్యవధిలో 21 చోట్ల బాంబు దాడులతో ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో 56 మంది మరణించగా, 246 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఆ తర్వాత సూరత్‌లో పేలని బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 78 మందిపై విచారణ జరగగా, 2022లో ప్రత్యేక కోర్టు 49 మందిని దోషులుగా తేల్చి, 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఉరిశిక్ష అమలుకు హైకోర్టు ధ్రువీకరణ తప్పనిసరి కావడంతో రాష్ట్ర ప్రభుత్వం శిక్షల నిర్ధారణ కోసం హైకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ అల్పేష్ కొగ్జే, జస్టిస్ సమీర్ దవేలతో కూడిన గుజరాత్ హైకోర్టు ధర్మాసనం గత రెండున్నరేళ్లుగా దాదాపు 248 సార్లు అప్పీళ్లపై విచారణ జరిపి మంగళవారం తుది తీర్పు వెల్లడించింది. . 38 మందికి మరణశిక్ష, 11 మందికి జీవితఖైదు విధిస్తూ 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సమర్థించింది. కిందికోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. ఈ పేలుళ్లలో మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షలు, గాయపడినవారికి రూ. 5 లక్షల పరిహారం ఇవ్వాలని గుజరాత్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మార్చి 31, 2027లోగా పరిహార చెల్లింపులు పూర్తి చేయాలని పేర్కొంది. నిషేధిత ఇండియన్ ముజాహిదీన్ , సిమి ఉగ్రవాద సంస్థల కుట్రను ప్రాసిక్యూషన్ నిరూపించగలిగింది. దేశద్రోహం, హత్య నేరాలతో పాటు కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం 'ఉపా' కింద దోషులుగా న్యాయస్థానం తేల్చింది. కాగా, దేశ చరిత్రలోనే ఒకే కేసులో ఇంతపెద్ద సంఖ్యలో 38 మందికి ఉరిశిక్షలు ఖరారు కావడం ఇదే ప్రథమం. 2008 జులై 26న అహ్మదాబాద్‌లో 21 చోట్ల జరిగిన వరుస పేలుళ్లలో 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 246 మంది గాయపడ్డారు. నగరవ్యాప్తంగా ఆసుపత్రులు సహా పలుచోట్ల పేలుళ్లు జరగ్గా రెండ్రోజుల తర్వాత సూరత్ లోనూ బాంబులు గుర్తించారు. ఇక పేలుళ్ల శబ్దాలకు సమీపంలో ఉన్నవారు కొంతకాలం వినికిడి శక్తి కోల్పోయారు. దర్యాప్తులో భాగంగా అహ్మదాబాద్ నగర నేరవిభాగం 100 మందిని నిందితులుగా పేర్కొంది. 78 మందిపై విచారణ చేపట్టింది. 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో 49 మందిని దోషులుగా నిర్ధరించింది. 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. అప్రూవర్‌గా మారిన ఒక నిందితుడికి క్షమాభిక్ష ప్రసాదించింది. తొలుత ఇచ్చిన వాంగ్మూలాలు ఉపసంహరించుకున్న మరో నలుగురు అప్రూవర్ల కు శిక్ష విధించింది. 2002లో జరిగిన గోధ్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు నాడు వార్తలు వచ్చాయి. తర్వాత ఇండియన్ ముజాహిదీన్ బాధ్యత ప్రకటించుకుంది. ఈ కేసు విచారణ సమయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 24 మంది నిందితులు టన్నెల్ తవ్వి జైలు నుంచి తప్పించుకునేందుకు యత్నించారు. అయితే ఆ కుట్రను పోలీసులు భగ్నం చేశారు.

# భూములు ఇచ్చిన రైతులకు 40వేల కౌలు


**మొదటి పేజీ తరువాయి**

మంత్రుల కమిటీ సిఫారసు మేరకు వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై చర్చించారు. ఇనాం భూముల కోసం దేవాదాయశాఖకు రూ. 159 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అమరావతి 25 టౌన్‌షిప్‌ల్లో ఒక ఇంటర్నేషనల్ స్కూల్ ఉండేలా చూడాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. రాత్రిలోగా భూములివ్వనివారికి రేపు భూ సేకరణ అమలు చేస్తామన్నారు. ఇప్పటికే ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్ 2.5 ఎకరాలకు అమలు చేస్తున్నామని తెలిపారు. రాజధాని అమరావతి అభివృద్ధి, రెండో దశ ల్యాండ్ పూలింగ్, రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు, వివిధ సంస్థలకు భూ కేటాయింపులు సహా తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపినట్లు నారాయణ వివరించారు. సమావేశం అనంతరం మీడియాకు మంత్రి నారాయణ వివరాలు వెల్లడించారు. అదేవిధంగా ప్రతి ఏడాది జరీబు భూములకు ఎకరానికి రూ. 5 వేల చొప్పున, మెట్ట భూములకు ఎకరానికి రూ. 3 వేల చొప్పున యాన్యుటీ పెంపునకూ అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామ కంఠాల్లో భూములు కోల్పోయిన వారికి ఏడాదికి రూ. 10 వేల చొప్పున చెల్లించాలని నిర్ణయించినట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. కొత్తగా ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో భూములు ఇచ్చే రైతు కుటుంబాలకు వ్యవసాయ రుణమాఫీ అమలు చేయాలని అథారిటీ నిర్ణయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ల్యాండ్ పూలింగ్‌కు ఇంకా భూములు ఇవ్వని రైతులకు మంగళవారం రాత్రి వరకు అవకాశం కల్పిస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ఆ తర్వాతా భూములు ఇవ్వకపోతే బుధవారం నుంచి భూసేకరణ పక్రియను అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే జారీ చేసిన ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్‌ను 2.5 ఎకరాల భూమికీ అమలు చేయనున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.

# టెంపుల్ టూరిజం తరహాలో హస్తకళల పర్యాటకం

**మొదటి పేజీ తరువాయి**

విజయవాడ అంబేడ్కర్ కళా వేదికలో నిర్వహించిన ఏపీ హస్తకళా మహోత్సవానికి పవన్ కల్యాణ్ హాజరయ్యారు. హస్తకళాకారులను అనారోగ్య సమస్యల నుంచి కాపాడాలన్నారు. తొలుత అందరికీ ఆరోగ్య పరీక్షలు చేయించాలని, హస్తకళాకారుల పిల్లలు చదువుకునేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. వంశపారం పర్యంగా వచ్చిన కళను ముందుకు తీసుకెళ్లడం కూడా ముఖ్యమే. హస్తకళా రంగాలు భారతదేశ మూలాలు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగాలంటే హస్తకళను, చేనేతను కాపాడుకోవాల్సి ఉందన్నారు. ఒక జాతి గొప్పతనం.. నిర్మించిన భవనాల్లో కాదు.. కళాకారుల్లో కనిపిస్తుంది. కళాకారుల ప్రతిభ.. వారి కష్టాన్ని గుర్తించడానికే ఇక్కడికి వచ్చాను. సంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఆంధ్రప్రదేశ్ పుట్టినిల్లు. అద్భుత కళల వెనుక లక్షల మంది కళాకారుల కృషి ఉంది. వస్తువుల తయారీ మాత్రమే కాదు.. వారసత్వాన్నీ సజీవంగా ఉంచుతున్నారు. తరతరాల సంప్రదాయాన్ని కళాకారులు కాపాడుతున్నారని అభినందించారు. రాష్ట్రంలో 2 లక్షల మందికిపైగా కళాకారులున్నారు. గ్లోబల్ మార్కెట్‌కు అనుసంధానం చేస్తూ హస్తకళా రంగానికి కొత్త దశను తీసుకొస్తాం. వదిలేసిన వస్త్రాలు కూడా వ్యర్థం కాకుండా వస్తువుల తయారీ చూస్తున్నాం. డబ్బు సంపాదనే కాదు.. పర్యావరణ పరిరక్షణ కూడా ప్రాముఖ్యంగా తీసుకుంటున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా హస్తకళా రంగం కూడా అభివృద్ధి చెందాలి.




మారుమూల గ్రామంలోని కళాకారుడి కృషి.. ప్రపంచానికి చేరాలనేదే ప్రభుత్వ లక్ష్యం. వోకల్ ఫర్ లోకల్ మాత్రమే కాదు.. లోకల్ టు గ్లోబల్ లక్ష్యంగా పని చేద్దామని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. సంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఏపీ పుట్టినిల్లు అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఒక జాతి గొప్పతనం నిర్మించిన భవనాల్లో కాదని, కళాకారుల్లో కనిపిస్తుందని అభివర్ణించారు. కళాకారుల అద్భుత ప్రతిభను, వారి కష్టాన్ని గుర్తించడానికి తాను ఈ కార్యక్రమానికి వచ్చానని తెలిపారు. హస్తకళాకారుల వస్తువుల తయారీ మాత్రమే కాకుండా, వారసత్వాన్ని సజీవంగా ఉంచుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా, రామాయణంలోని రావణ సంహార ఘట్టాన్ని తోలుబొమ్మలాట కళాకారులు ప్రదర్శించిన తీరును పవన్ కల్యాణ్ అభినందించారు. ప్రతి స్టాల్‌ను సందర్శించి, హస్తకళా ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా కళాకారులను వ్యక్తిగతంగా పవన్ కల్యాణ్ ప్రోత్సహించారు. కళాకారులతో కలిసిపోయి, వారి నైపుణ్యాలను ప్రశంసించారు. వారి విజయాలు, సవాళ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. కళాకారుల కోరిక మేరకు, క్లస్టర్ల వారీగా గ్రూప్ ఫొటోలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడారు. ఏపీ హస్తకళల అభివృద్ధికి తమ ప్రభుత్వం అవసరమైన మద్దతును అందిస్తోందని స్పష్టం చేశారు. పర్యావరణ పర్యాటకం, ఆలయ పర్యాటకం తరహాలో హస్తకళల పర్యాటకాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం తెలిపారు. కళాఖండాలను సృష్టించే కళాకారులకు తగిన గుర్తింపు లభించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కళాకారుల పోరాటాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి ప్రత్యేక డాక్యుమెంటరీలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వీబీజీ రామ్ జీ పథకం కింద క్లస్టర్ల వారీగా ఉమ్మడి సౌకర్యాల కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. హస్తకళల పరిరక్షణకు సాధ్యమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. హస్తకళాకారుల ఆరోగ్య పరిరక్షణ కోసం క్లస్టర్ల వారీగా నిరంతర వైద్య శిబిరాలను నిర్వహించాలని సూచించారు. ఆంధప్రదేశ్ హస్తకళల ఉత్సవంలో మొదటి అడుగుగా కాకినాడకు చెందిన తోలుబొమ్మలాట కళాకారులు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పవన్ కల్యాణ్ సందర్శించారు. సనాతన ధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పేలా రూపొందించిన రామాయణ, మహాభారత, భాగవత కళారూపాలను పరిశీలించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
బుధవారం 8 జులై 2026

# భూమా విగ్రహం ఏర్పాటు చేయాలన్న డిమాండ్.

**-నంద్యాల అభివృద్ధిలో భూమా నాగిరెడ్డి సేవలు చిరస్మరణీయం.**

**-శ్రీనివాస్ సెంటర్‌లో ప్రతిష్ఠించాలని టీడీపీ నేతలు, కార్యకర్తల విజ్ఞప్తి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 07:**




నంద్యాల పట్టణ అభివృద్ధికి విశేష కృషి చేసిన దివంగత మాజీ మంత్రి భూమా నాగిరెడ్డి విగ్రహాన్ని శ్రీనివాస్ సెంటర్‌లో ఏర్పాటు చేయాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.
భూమా నాగిరెడ్డి ప్రజాప్రతినిధిగా ఉన్న సమయంలో నంద్యాల పట్టణంలోని పేద ప్రజలకు సుమారు 13 వేల గృహాలు మంజూరు చేయించారని వారు గుర్తు చేశారు. పట్టణ ప్రజలకు దీర్ఘకాలిక తాగునీటి సమస్యకు పరిషారంగా అమృత పథకాన్ని తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. అలాగే నూనెపల్లె నుంచి గాంధీచౌక్ వరకు రహదారి విస్తరణ పనులను చేపట్టి పట్టణ అభివృద్ధికి ఊతమిచ్చారని తెలిపారు. దీనితో పాటు పలు మౌలిక వసతుల కల్పనకు కృషి చేసి నంద్యాల అభివృద్ధిలో చెరగని ముద్ర వేశారని అన్నారు.నంద్యాల అభివృద్ధికి భూమా నాగిరెడ్డి చేసిన సేవలను భావితరాలకు చాటిచెప్పేలా శ్రీనివాస్ సెంటర్‌లో ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని ప్రభుత్వం, సంబంధిత అధికారులను టీడీపీ నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు.

# ఉచిత క్యాన్సర్ పరీక్షల మహో శిబిరం ఆరోగ్యమే మహాభాగ్యం

**..నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూలై 07:**



సమాజ ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా, బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి, రాయలసీమ ఫౌండేషన్ సహకారంతో రూ.15,000 విలువైన ఉచిత క్యాన్సర్ పరీక్షలను నిర్వహిస్తున్నామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి మంగళవారం అన్నారు.నంద్యాల పార్లమెంట్ పరిధిలో ఉచిత వైద్య శిబిరం తేదీలు, ఈ నెల 12 వ తేదీ నందికొట్కూరు నియోజకవర్గం నెహ్రూ నగర్ గ్రామంలో, ఈ నెల 13 వ తేదీ నంద్యాల పట్టణంలోని మున్సిపల్ టౌన్ హాల్ లో, ఈ నెల 14 వ తేదీన డోన్ పట్టణంలో ప్రత్యేకంగా ఉచిత కాన్సర్ పరీక్ష శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని, ముందస్తు పరీక్షల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకుందామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు.

# సర్ ప్రక్రియ మరింత వేగవంతం కావాలి.

**..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 07:** గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో సర్ ప్రక్రియ మరింత వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లను ఆదేశించారు. మంగళవారం సర్ డిజిటైజేషన్ ప్రక్రియ అంశం పై కలెక్టర్ ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిజిటైజేషన్ ప్రక్రియలో పాణ్యం 53.38%, కర్నూలు 48.64%, ఆదోని 51.37% ఉందని, మిగతా నియోజకవర్గాలు ఇప్పటికే 60% దాటగా, పత్తికొండ 64%, కోడుమూరు 65.83%, ఆలూరు 65.10%, 65% లక్ష్యానికి చేరుకున్నాయన్నారు.. పాణ్యం, కర్నూలు మరియు ఆదోని నియోజకవర్గాల ఈ ఆర్ ఓ లు అదనపు కృషి చేసి, ప్రస్తుత స్థాయి నుంచి 65% వరకు పనితీరును పెంచాలని కలెక్టర్ సంబంధిత ఈఆర్ఓ లను ఆదేశించారు. డిజిటైజేషన్ ప్రక్రియలో ఈరోజు సాయంత్రం నాటికి ఏ ఒక్క పోలింగ్ కేంద్రం కూడా 40 శాతం కంటే తక్కువ పురోగతితో ఉండకూడదన్నారు.. బుక్ ఏ కాల్ కు సంబంధించి పెండింగ్ లో ఉన్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ బూత్ లెవల్ ఏజెంట్లను తప్పనిసరిగా బీఎల్ఓలకు సహకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రక్రియ పూర్తిచేయడంలో ఈ వారం అత్యంత కీలకమైనదన్నారు. అందువల్ల ప్రతి ఓటరును కవర్ చేయాలనే లక్ష్యంతో అన్ని రాజకీయ పార్టీల బీఎల్ఏలు చురుకుగా పనిచేయాలన్నారు. ఇప్పటికే ఈ అంశాలను రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి చెప్పి ఉంటారని, ఒకవేళ ఇంకా నిర్వహించకపోతే, ఈరోజే అత్యవసరంగా సమావేశం ఏర్పాటు చేసి, బీఎల్ఏలు బీఎల్ఓలకు పూర్తి సహకారం అందించేలా సూచనలు ఇవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ.. ఆయా బీఎల్ఓలకు వారి పరిధిలో ఉన్న ఆర్‌పీలు సహకరించే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లు, మెప్మా పీడీ లను ఆదేశించారు. ప్రతి ఎస్ హెచ్ జీ మెంబర్ కుటుంబానికి సంబంధించిన వెల్లి, ఫామ్స్ కలెక్ట్ చేసి, బిఎల్ఓ లకు ఇచ్చే బాధ్యత ఆర్పీ లు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. టెలి కాన్ఫరెన్స్ లో కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ మధుసూదన్ రెడ్డి, పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# భాజపా కిసాన్ మోర్చా రాష్ట్ర సీడ్స్ సెల్ కన్వీనర్‌గా పడకండ్ల నాగేశ్వరరావు

**-శుభాకాంక్షలు తెలిపిన జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు శుభాకాంక్షలు.**

**-మహానంది మండల సీనియర్ బీజేపీ నాయకుడికి దక్కిన ప్రాధాన్యం**

**ఆంధ్ర ప్రగతి మహానంది జూలై 07:**



శ్రీశైలం నియోజకవర్గం మహానంది మండలం గాజులపల్లి గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు పడకండ్ల నాగేశ్వర రావుకు రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు దక్కాయి. ఆయనను భాజపా కిసాన్ మోర్చా రాష్ట్ర సీడ్స్ సెల్ కన్వీనర్‌గా నియమించారు. నాగేశ్వర రావు నియామకం పట్ల భాజపా జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు హర్షం వ్యక్తం చేస్తూ, జిల్లా పార్టీ తరఫున ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా అభిరుచి మధు మాట్లాడుతూ.. నాగేశ్వర రావు సీనియారిటీ, నిబద్ధతను గుర్తించి పార్టీ నాయకత్వం ఈ బాధ్యతలను అప్పగించిందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రైతు విభాగంలో పార్టీ బలోపేతానికి, రైతాంగ సమస్యల పరిష్కారానికి ఆయన చురుగ్గా కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నాగేశ్వర రావుకు రాష్ట్ర స్థాయి పదవి దక్కడం పట్ల మహానంది మండలంతో పాటు శ్రీశైలం నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

# వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు 100 శాతం పూర్తి చేయాలి.

**..విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, సురక్షిత తాగునీరు, ఆరోగ్యం, మంచి వాతావరణం కల్పించాలి.**

**..స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర, నెట్ జీరో హెల్తీ క్యాంపస్ లక్ష్యాల సాధనలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి.**

**..ఆపరేషన్ క్లీన్ స్వీప్, పారిశుధ్య కార్యక్రమాలు, హాస్టళ్ల పర్యవేక్షణపై సమీక్ష సమావేశం లో.**

**..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**





**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 07:**
స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర, నెట్ జీరో హెల్తీ క్యాంపస్ లక్ష్యాల సాధనలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు.
మంగళవారం జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర, నెట్ జీరో హెల్తీ క్యాంపస్ కార్యక్రమాల అమలు, వసతి గృహాల నిర్వహణ, పారిశుధ్య కార్యక్రమాల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను 100 శాతం పూర్తి చేసి విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహాల నిర్వహణను కేవలం సంబంధిత శాఖలకే పరిమితం చేయకుండా జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు వసతి గృహాలను క్రమం తప్పకుండా సందర్శించి ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు వారికి ప్రోత్సాహం కలిగించేలా మంచి మాటలు చెప్పి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని తెలిపారు. హాస్టళ్లలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నదా లేదా, కూరగాయలు, పండ్లు, పౌష్టికాహారం సరైన విధంగా అందిస్తున్నారా, వసతి గృహాల పరిశుభ్రత, మరుగుదొడ్లు, వంటశాలలు, పడక గదులు, తాగునీటి సౌకర్యాలు తదితర అంశాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి వసతి గృహంలో తాగునీటి నాణ్యతను నిర్ధారించేందుకు వాటర్ శాంపిళ్లను క్రమం తప్పకుండా పరీక్షించాలని సూచించారు. అలాగే ఎక్కడైతే త్రాగునీరు సంబంధించిన పైప్ లైన్ మరమ్మతులు ఉంటాయో వాటిని పరిష్కరించాలని సూచించారు. ఎక్కడైతే ఆర్.ఓ. ప్లాంట్లు ఏర్పాటు చేసి వినియోగంలో లేకపోయాయో వాటన్నింటినీ వెంటనే ప్రారంభించి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పిల్లలకు అందించే కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలు నాణ్యమైనవిగా ఉండాలని, పౌష్టికాహారంతో కూడిన ఆహారం అందించడంతో పాటు విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని తెలిపారు. అవసరమైతే వైద్య పరీక్షలు కూడా నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు.మున్సిపల్ ప్రాంతాల్లో అభివృద్ధి చేస్తున్న పార్కుల పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే జిల్లాలో చేపట్టిన మొక్కల నాటే కార్యక్రమాన్ని నెలరోజుల్లో పూర్తి చేసి మొక్కల సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యారంగంలోనూ నాణ్యత పెంపొందించేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పదో తరగతి ఉత్తీర్ణత శాతాన్ని ఈ విద్యా సంవత్సరంలో కనీసం 10 శాతం మేర పెంచేలా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే ప్రభుత్వ లక్ష్యాలు సమర్థవంతంగా అమలవుతాయని పేర్కొన్న జిల్లా కలెక్టర్, పనుల్లో ఎలాంటి అంతరాయాలు లేకుండా సమిష్టి బాధ్యతతో ముందుకు సాగాలని ఆదేశించారు.
ఈ సమావేశానికి డ్వామా పీడీ నర్సింహారెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి రాధిక, బీసీ వెల్ఫేర్ ప్రసూన, ట్రైబల్ వెల్ఫేర్ సురేష్ ,ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డిఆర్డిఏ పిడి రమణారెడ్డి , కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు , సిపిఓ భారతి , పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి , అడిషనల్ కమిషనర్ కృష్ణ , డిపిఓ భాస్కర్, ఎస్ ఎస్ ఎ ఏపీసి లోకరాజు, కన్వీనర్ పుష్ప రాజ్, కోఆర్డినేటర్లు గీత, శ్రీదేవి, ఆదోని ఎమ్మిగనూరు గూడూరు మున్సిపల్ కమిషనర్లు మరియు సంబంధించిన అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

# ఈ నెల 3వ శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలి.

**-జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 07:**
జిల్లా వ్యాప్తంగా ఈ నెల 3వ శనివారం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.
మంగళవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా వ్యాప్తంగా మొక్కల పెంపకం అంశం పై కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో మొత్తం 45 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇప్పటికే వివిధ శాఖలకు లక్ష్యాలు కేటాయించామని కలెక్టర్ తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా అవి సురక్షితంగా ఉండి, ఆరోగ్యంగా పెరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.. మొక్కల సంరక్షణ, పెరుగుదలను నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రస్తుతం మన గ్రీన్ కవర్ 6% మాత్రమే ఉండగా, అది కనీసం 33% వరకు చేరాల్సిన అవసరం ఉందన్నారు. 45 లక్షల మొక్కలు నాటినా గ్రీన్ కవర్ కేవలం సుమారు 1% మాత్రమే పెరుగుతుందన్నారు. అందుకే ఈ లక్ష్యాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకొని విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి ఒక్కో మొక్కను అందించి, మొక్కలను విద్యార్థులు సంరక్షించే విధంగా ఉపాధ్యాయుల చర్యలు తీసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు మొక్కలను అందించాలని, ముఖ్యంగా పండ్ల మొక్కలను ఇస్తే వాటి సంరక్షణపై వారికి సహజంగానే ఆసక్తి పెరుగుతుందన్నారు. ఇలాంటి చిన్నచిన్న అంశాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళిక రూపొందిస్తే ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయన్నారు. శాస్త్రీయ పద్ధతిలో ప్లాంటేషన్‌తో పాటు సీడ్ పెల్లెటైజేషన్‌ను సమర్థవంతంగా అమలు చేస్తే హరితాభివృద్ధి లక్ష్యాలను మరింత వేగంగా, స్థిరంగా సాధించవచ్చన్నారు. అవసరమైన చోట అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టే అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ పరిశ్రమల శాఖ జీఎం ను ఆదేశించారు. నగరంలోని అన్ని పార్కులు, బ్యూటిఫికేషన్ ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ భూముల గట్లపై (బండ్లపై) సుబాబుల్ మొక్కలను నాటేలా ఉద్యానవన, వ్యవసాయ శాఖలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇవి వేగంగా పెరిగి నీడను అందించడంతో పాటు రైతులకు ఉపయోగకరంగా ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. మొక్కలను సకాలంలో తీసుకుని నాటే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు ప్రారంభమైన వెంటనే మొక్కలు నాటడం పూర్తి చేయాలని, ఇది సీజనల్ కార్యక్రమం కావడంతో ఆలస్యం చేయకుండా లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎక్కడైతే మొక్కలు నాటారో, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా కు సంబంధించిన 'మేరీ లైఫ్' పోర్టల్ లో అప్‌డేట్ చేయాలని జిల్లా యొక్క పురోగతి అందులో కనిపిస్తుందన్నారు.
సమావేశంలో డిఎఫ్ఓ శ్యామల, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, డిఆర్డిఏ పిడి రమణారెడ్డి, డ్వామా పిడి నరసింహ రెడ్డి, డి ఎం హెచ్ ఓ డా.భాస్కర్ రాజు, డి సి హెచ్ ఎస్ డా.జాఫ్రుల్లా, బీసీ సంక్షేమ అధికారి ప్రసూన, ఐసిడిఎస్ పిడి విజయ, ఉద్యాన శాఖ అధికారి రాజాకృష్ణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లు..

## ప్రోటోకాల్‌కు అనుగుణంగా పకడ్బందీగా పూర్తి చేయాలి.

**ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలి.**

**..హెలిప్యాడ్, తహసీల్దార్ కార్యాలయం, ప్రజా వేదికలను పరిశీలించిన రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె/నంద్యాల, జూలై 07:**



ఈ నెల 9వ తేదీన బనగానపల్లెలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సునీల్ షోరాన్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ వీరి వెంట ఉన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన హెలిప్యాడ్, తహసీల్దార్ కార్యాలయం, ప్రజా వేదికతో పాటు ఇతర కీలక ప్రాంతాలను సందర్శించి వివిధ శాఖల అధికారులు చేపట్టిన ఏర్పాట్లను సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమంలో, ప్రతి శాఖ అధికారి తనకు అప్పగించిన బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఏర్పాట్లలో నాణ్యత, సమన్వయం, సమయపాలనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి లోపాలకు తావులేకుండా అన్ని పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. హెలిప్యాడ్ వద్ద భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, హెలికాప్టర్ ల్యాండింగ్, టేకాఫ్‌కు ఎటువంటి ఆటంకాలు లేకుండా పరిసర ప్రాంతాలను పూర్తిగా సిద్ధం చేయాలని ఆదేశించారు. హెలిప్యాడ్‌కు వెళ్లే రహదారులు, బ్యారికేడింగ్, భద్రతా వలయం, విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య ఏర్పాట్లు, అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాలకు సంబంధించిన ప్రతి అంశాన్ని ప్రభుత్వ ప్రోటోకాల్‌కు అనుగుణంగా నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయడం, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్ తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజా వేదిక వద్ద సభా ప్రాంగణాన్ని సక్రమంగా అభివృద్ధి చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాగునీరు, మరుగుదొడ్లు, షామియానాలు, కుర్చీలు, విద్యుత్, సౌండ్ సిస్టమ్, వైద్య శిబిరం, అగ్నిమాపక సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర మౌలిక వసతులను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రజల రాకపోకలకు ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్ నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని పోలీసు శాఖకు మంత్రి ఆదేశించారు.జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ప్రతి శాఖకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. అప్పగించిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, అన్ని ఏర్పాట్లు తుది దశకు చేరేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. కార్యక్రమానికి సంబంధించిన ప్రతి అంశాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన చోట వెంటనే సవరణలు చేపట్టాలని ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేసి ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సునీల్ షోరాన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అత్యున్నత స్థాయి భద్రతా ఏర్పాట్లు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, బందోబస్తు, జనసంచార నియంత్రణ, అత్యవసర స్పందన బృందాలు, అగ్నిమాపక, వైద్య సేవలు పూర్తి సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. భద్రతా విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమం జరిగే నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండేలా ప్రతి శాఖ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు

# 'సర్' కాల వ్యవధిని పెంచాలి

..అధికార పత్రం బీజేపీ, ఆర్ఎస్ఎస్ గుర్తింపు కార్డులు ఉండాలా.

..ఉపా చట్టాన్ని రద్దు చేయాలి.

..దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ.

..రైతులను ఆదుకోవాలి.

..అయోధ్య సొత్తు ఎవరి పాలు.

..ఆగస్టు నుంచి 6 నుంచి 15 వరకు ప్రచార పోరాట కార్యక్రమాలు.

..సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ.


..సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 07:**
రాష్ట్రంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రక్రియ ఇప్పటి వరకు 45 శాతం కూడా జరగలేదని గణాంకాలు చెబుతుండగా ఎన్నికల కమీషనర్, జిల్లా కలెక్టర్లు ఓటర్ల హక్కులను కోల్పోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకొని ప్రతి ఒక్కరినీ ఓటరుగా చేర్పించాలంటే ప్రస్తుత సమయం సరిపోదని, ఓటర్ల జాబితా ప్రక్రియకు సంబంధించి మరో మూడు మాసాలు గడువును పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అధికారులను డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియను నిర్వహించే అధికారులకు, ప్రజలకు ఓటర్ల ప్రక్రియపైన పూర్తి అవగాహన లేకపోవంతో పలు ఇబ్బందులకు గురవుతున్నారని దీని వలన గడువును పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మంగళవారం హోచిమిన్ భవన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో జరుగుతున్న అనేక రాజకీయ అంశాలపైన ప్రజా హక్కులపైన రైతుల ఆందోళనలపైన అయోధ్య రామమందిరంలో జరిగిన ఆర్థిక కుంభకోణాలపైన సమగ్రంగా వివరిస్తూ దేశ ప్రజల సమస్యలపైన అలుపెరుగని పోరాటంతో దశలవారీగా ముందుకు వెళతామన్నారు. ఓటర్ల జాబితా కోసం నియమించిన అధికారులకు సాంకేతిక పరమైన అవగాహన లోపాలు ఉన్నాయని గుర్తింపు కార్డుల పరిశీలన 2002 ముందు కంటే ఓటర్ల జాబితా పైన సరైన అవగాహన లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం పాసుపోర్టులు కూడా ప్రయాణానికి ఉపయోగించే ధృవీకరించే పత్రంలాగా గుర్తిస్తున్నాయని అంతేకాకుండా ఆధార్కార్డు, రేషన్కార్డు, పాన్కార్డు ఇలాంటి అనేక కార్డులకు కూడా విలువ లేకుండా కేంద్ర ప్రభుత్వం నిరంకుశ పాలనను సాగిస్తుందని ఘాటుగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ పాలనకు చంద్రబాబు, పవన్కల్యాణ్, జగన్మోహన్రెడ్డిలు తొత్తులుగా వ్యవహరిస్తూ తానా అంటే తందానా అని వంత పాడుతున్నారని విమర్శించారు. భారతదేశ పౌరుడిగా ఉండాలంటే బీజేపీ లేదా ఆర్ఎస్ఎస్ గుర్తింపు కార్డులు ఉంటే సరిపోతాయా అని ఆయన ప్రశ్నించారు.

## ఈ నెల 9న బనగానపల్లెకు ముఖ్యమంత్రి చంద్రబాబు.

..మీ భూమి- మీహక్కు కార్యక్రమానికి హాజరుకానున్న సీఎం.



**ఆంధ్ర ప్రగతి అమరావతి, జూలై 07:** మీ భూమి–మీహక్కు కార్యక్రమంలో భాగంగా పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 9 తేదీన నంద్యాల జిల్లాలో పర్యటించనున్నారు. రీ సర్వే ప్రక్రియ పూర్తైన గ్రామాల్లోని రైతులు, భూ యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేసేందుకు గానూ ముఖ్యమంత్రి బనగానపల్లె నియోజకవర్గంలో పర్యటించనున్నారు. జూలై 9 తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేసే పట్టాదారు పాస్ పుస్తకాలతో కలిపి ఇప్పటి వరకూ ప్రభుత్వం 29 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేసినట్టు అవుతుంది. ఇప్పటివరకు 6,887 గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ పూర్తి చేసి 29.04 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వం ముద్రించి పంపిణీ చేసింది. ఈ నెల రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 428 గ్రామాల్లో 2.48 లక్షల పట్టాదార్ పాస్ పుస్తకాల పరిశీలనను రెవెన్యూ శాఖ పూర్తి చేసింది. నంద్యాల జిల్లాలో 8,412 ఖాతా పుస్తకాలు, బనగానపల్లె నియోజకవర్గంలోని 1,125 పాస్ పుస్తకాలను రెవెన్యూ శాఖ సిద్ధం చేసింది. వచ్చే ఏడాది మార్చి నాటికి మిగిలిన 9,929 గ్రామాల్లోనూ సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇంకా 64.53 లక్షల రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉంది. మీ భూమి మీ హక్కు సమావేశం అనంతరం బనగానపల్లె పార్టీ కార్యకర్తలతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు.

**సీఎం బనగానపల్లె షెడ్యూలు వివరాలివి..:** ఈ నెల 9 తేదీన ఉదయం 10 గంటలకు అమరావతి నుంచి బనగానపల్లెకు ముఖ్యమంత్రి బయల్దేరి వెళ్లనున్నారు. 11.20కి బనగానపల్లె చేరుకుని స్థానిక తహసిల్దారు కార్యాలయానికి వెళ్లనున్న ముఖ్యమంత్రి అక్కడ ప్రజలకు అందుతున్న సేవలను నేరుగా పరిశీలించనున్నారు. అలాగే పలువురు రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు మీ భూమి- మీ హక్కు పేరిట పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.35 గంటలకు బనగానపల్లె నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. సాయంత్రం 4 గంటల తర్వాత ఆయన అమరావతికి బయల్దేరనున్నారు.

## మున్సిపల్ ఎంఈ బాధ్యతలు చేపట్టిన నాగభూషణం రెడ్డి.

..శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ సిబ్బంది.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 07:**
నంద్యాల మున్సిపాలిటీలో మున్సిపల్ ఇంజినీర్ (ఎంఈ)గా నాగభూషణం రెడ్డి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు మున్సిపల్ ఎంఈగా పనిచేసిన గురప్ప యాదవ్ కర్నూలుకు బదిలీ కావడంతో ఖాళీ అయిన బాధ్యతలను నాగభూషణం రెడ్డికి అప్పగించారు.ప్రస్తుతం మున్సిపల్ వాటర్ వర్క్స్ డిప్యూటీ ఇంజినీర్ (డీఈ)గా విధులు నిర్వహిస్తున్న నాగభూషణం రెడ్డి, మున్సిపల్ ఎంఈగా అదనపు బాధ్యతలు స్వీకరించి విధుల్లో చేరారు.ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది, ఉద్యోగులు నాగభూషణం రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేశారు.

## ఎస్ఐఆర్ క్షేత్రస్థాయిలో కమిషనర్ తనిఖీ.

33వ వార్డులో ఇంటింటి పరిశీలన.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 07:** రాష్ట్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నంద్యాల మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పట్టణంలోని 33వ వార్డు జ్ఞానాపురంలో ఎస్ఐఆర్ పీఎస్ నంబర్లు 109, 110 పరిధిలో ఇంటింటి సర్వేను తనిఖీ చేసి, ఓటర్ల వివరాల నమోదు, ధ్రువీకరణ ప్రక్రియను పరిశీలించారు.
అధికారులు ప్రతి ఇంటిని సందర్శిస్తూ అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో చేర్చడం, వివరాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయడం, అవసరమైన పత్రాలను సక్రమంగా పరిశీలించడం వంటి అంశాలపై కమిషనర్ సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారదర్శకంగా, వేగవంతంగా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.
ఈ తనిఖీలో మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్లు విక్రమ్, శానిటేషన్ సూపర్వైజర్లు లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## 2029లో జమిలి ఎలక్షన్స్..?

..దేశంలో ఒకే సారి ఎన్నికలు (జమిలి) నిర్వహించాలని మోదీ ప్రభుత్వం భావిస్తోంది.



**ఆంధ్ర ప్రగతి అమరావతి జులై 07:**
నిత్యం ఎన్నికల వాతావరణాన్ని తొలగించి అభివృద్ధిపై పాలనను కేంద్రీకరించే లక్ష్యంతో ఈ బిల్లును తెచ్చినట్టు తెలుస్తోంది. 2028 జులైలోపు బిల్లు వస్తే 2029 జనరల్ ఎన్నికలు జమిలిగా నిర్వహించడం సాధ్యమేనని చెబుతున్నారు. అయితే 2029 నుంచి 2034 వరకు విడతల వారీగా జమిలి ఎన్నికలు నిర్వహించాలనే ప్రతిపాదన జేపీసీ వద్ద ఉన్నట్టు సమాచారం. దీని ప్రకారం.. 2028లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే తెలంగాణ తో సహా ఇతర రాష్ట్రాల అసెంబ్లీ గడువు మరో ఐదారు నెలలు పొడిగించాల్సి ఉంటుంది. మరికొన్నిరాష్ట్రాల గడువు తగ్గించవచ్చు. ఇక మూడో విడతలో భాగంగా 2030, 31లో జరిగే రాష్ట్రాల అసెంబ్లీలను ఒకటి లేదా రెండేళ్లు తగ్గించి 2034 లోక్సభ ఎన్నికలతోపాటు నిర్వహించే ఛాన్స్ ఉంది. ఫలితంగా 2034 నుంచి జమిలి ఎన్నికలు సంపూర్ణంగా అమల్లోకి వస్తాయి.

## దేవాలయ పునర్నిర్మాణ పనులు నిలిపివేత.. బుగ్గన పాదయాత్ర.!





**ఆంధ్ర ప్రగతి డోన్ జూలై 07:**
డోన్ మండలం గుండాల చెన్న కేశవ స్వామి దేవాలయ పునః నిర్మాణ పనులను నిలిపివేతను నిరసిస్థు పాదయాత్ర చేపట్టిన మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి.గత ప్రభుత్వంలో ఆలయాల పునరుద్ధరణ కోసం దాదాపు 50 కోట్ల రూపాయలు మంజూరు.
10 కోట్ల రూపాయలతో చేపట్టిన గుండాల దేవాలయ పనులు.కాంట్రాక్టర్లను కమీషన్ల కోసం టీడీపీ నేతలు బెదిరించడంతో నిలిచిపోయిన దేవాలయం పనులు. కూటమి నేతలకు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ కోట్రాయి గ్రామం నుంచి గుండాల ఆలయం వరకు పాదయాత్రజ చేపట్టిన మాజీ మంత్రివర్యులు శ్రీ బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి ...ఈ కార్యక్రమం లో రాష్ట్ర మాజీ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు,పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మెట్టు వెంకటేశ్వర రెడ్డి,ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి ,వైస్ ఎంపీపీ ఎర్రి స్వామి ,మండల అధ్యక్షుడు సోమేశ్ యాదవ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ తిరుమల్ రెడ్డి,మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రామచంద్రుడు,మలియాల భాస్కర్ రెడ్డి ,మలియాల శ్రీను, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులకు నంద్యాల లయన్స్ క్లబ్ పురస్కారాలు.

..పురస్కారాలు అందుకున్న డాక్టర్ అలీ భాష, డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, డాక్టర్ కామిని నాగార్జున, డాక్టర్ ఉయ్యాలవాడ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ గురు ప్రసాద్.

..వైద్యుల సత్కార కార్యక్రమానికి సహకరించిన సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యుడు కుంచా మహేశ్వరరెడ్డి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 07:**
జాతీయ వైద్య దినోత్సవం సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ ఎంపిక చేసిన ఐదు మంది వైద్యులకు లయన్స్ క్లబ్ వైద్యుల దినోత్సవ పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్ అధ్యక్షతన, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు కుంచా మహేశ్వరరెడ్డి సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ అలీ భాషా, ప్రముఖ ఎముకలు కీళ్ల శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి,డాక్టర్ ఉయ్యాలవాడ శ్రీధర్ రెడ్డి, ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ కామిని నాగార్జున, ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ గురు ప్రసాద్ లకు లయన్స్ క్లబ్ వైద్యుల దినోత్సవం పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు.
ఈ కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి,వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ,ఈ కార్యక్రమానికి సహకరించిన కుంచా మహేశ్వరరెడ్డి,లయన్స్ క్లబ్ కార్యదర్శి మేడా చంద్రశేఖర్, కోశాధికారి సురేష్,సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు, రీజనల్ చైర్మన్ పీవీ సుధాకర్ రెడ్డి, జోనల్ చైర్మన్ నిజాముద్దీన్, లయన్స్ జిల్లా గ్లోబల్ మెంబర్ షిప్ కోఆర్డినేటర్ రవి ప్రకాష్, అధిక సంఖ్యలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.




## బనగానపల్లెలో ఆటోమేటిక్ రైన్ గేజ్ స్టేషన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.

..సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి.

**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె/నంద్యాల, జూలై 07:**
రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఈ నెల 9న బనగానపల్లెలో జరగనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం పర్యటన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి సందర్శించనున్న ప్రాంతాల్లో చేపట్టిన ఏర్పాట్లను తనిఖీ చేస్తూ, ప్రతి అంశాన్ని నాణ్యతతో, సమయపాలనతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ సందర్భంగా భారత వాతావరణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ రైన్ గేజ్ స్టేషన్‌ను కలెక్టర్ పరిశీలించారు. గత పదేళ్లుగా నిర్వహణ లేక పనిచేయకుండా ఉన్న ఈ కేంద్రాన్ని జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవతో తిరిగి పనిచేసే స్థితికి తీసుకురావడం జరిగిందని భూగర్భ జల శాఖ డిడి రఘురాం కలెక్టర్‌కు వివరించారు. ఈ మేరకు భారత వాతావరణ శాఖ అధికారులతో సమన్వయం చేసి, అవసరమైన సాంకేతిక సిబ్బందిని రప్పించి స్టేషన్‌ను పునరుద్ధరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆటోమేటిక్ రైన్ గేజ్ స్టేషన్ ద్వారా ఎలాంటి మానవ ప్రమేయం లేకుండానే వర్షపాతం వివరాలు అత్యంత ఖచ్చితంగా నమోదు అవుతాయని తెలిపారు. గతంలో మాన్యువల్ విధానంలో వర్షపాతం కొలిచే పరిస్థితి ఉండగా, ప్రస్తుతం ఆధునిక సాంకేతికతతో రియల్ టైమ్‌లో వర్షపాతం నమోదై సంబంధిత కేంద్రాలకు చేరుతుందని పేర్కొన్నారు.



అధికారులు ఆటోమేటిక్ రైన్ గేజ్ స్టేషన్ పనితీరును కలెక్టర్‌కు వివరించారు. 200 మిల్లీమీటర్ల ఫనల్ ద్వారా సేకరించిన వర్షపు నీరు టిప్పింగ్ బకెట్‌లోకి చేరుతుందని, ప్రతి 0.5 మిల్లీమీటర్ల వర్షపాతానికి ఒకసారి బకెట్ టిల్ట్ అవుతుందని తెలిపారు. ఆ టిల్ట్‌లను మ్యాగ్నెటిక్ స్విచ్ గుర్తించి డేటా లాగర్‌కు పంపుతుందని, నమోదైన టిప్స్ ఆధారంగా ఆ రోజు కురిసిన వర్షపాతాన్ని అత్యంత ఖచ్చితంగా లెక్కించవచ్చని వివరించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఎలాంటి లోపాలకు తావులేకుండా పూర్తి చేయాలని, సందర్శించే ప్రతి ప్రాంతంలో పరిశుభ్రత, భద్రత, మౌలిక సదుపాయాలు, సాంకేతిక ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# శిల్పా రవి నటనలో కమలహాసన్ ను మించిపోయాడు

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 07:**
వైసీపీకి డైవర్షన్ పాలిటిక్స్ కొత్తది కాదని, అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా అదే రాజకీయాలు చేస్తోందని విమర్శించిన టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి. నంద్యాలలో నూతన వైయస్ విగ్రహం ఏర్పాటు వద్ద ఉన్న శిలాఫలకాన్ని తీసేస్తే ఊరుకునేది లేదు అంటూ హెచ్చరించిన టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి. నంద్యాలలో శిల్పా కుటుంబం వివాదాలను సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని ఆరోపించిన టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి.గతంలో చంద్రబాబు నాయుడు నంద్యాలకు వచ్చిన సమయంలో కూడా ఉద్దేశపూర్వకంగా వివాదాలు సృష్టించారని విమర్శించారు.ఈనెల 11న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనకు ముందు వైఎస్ విగ్రహ ఆవిష్కరణ పెట్టడం వెనుక రాజకీయ ఉద్దేశం ఉందని వ్యాఖ్యానించిన టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి.వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ధ్వంసాన్ని టీడీపీ అప్పుడే ఖండించిందని స్పష్టం చేసిన టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్




రెడ్డి.రాజకీయ నాయకులందరికీ గౌరవం ఇవ్వడం టీడీపీ సంప్రదాయమని పేర్కొన్నారు.
వైఎస్ విగ్రహం ధ్వంసం చేసిన వారు వైసీపీ కార్యకర్తలేనని వీడియోల ద్వారా బయటపడిందని ఆరోపించారు.వీడియోలు బయటకు రాకపోయి ఉంటే టీడీపీపై నింద వేసేవారని అన్నారు.భూమా నాగిరెడ్డి వైఎస్ రాజశేఖర్ రెడ్డిపై అభిమానంతో జిల్లాలో అనేక విగ్రహాలు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు.శిల్పా కుటుంబం వైఎస్ పేరు ద్వారా రాజకీయంగా, ఆర్థికంగా లాభపడిందని ఆరోపించారు.
కొత్తగా ఏర్పాటు చేస్తున్న వైఎస్ విగ్రహం వద్ద భూమా నాగిరెడ్డి శిలాఫలకాన్ని తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.నిజంగా శిలాఫలకం ఉంటే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటానని, లేకపోతే ఇది నీచ రాజకీయాలకు నిదర్శనమని అన్నారు.ప్రజలు శిల్పా కుటుంబ రాజకీయాలను గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు.శిల్పా రవి చేసిన ప్రెస్‌మీట్‌ను "నటన"గా అభివర్ణిస్తూ ఎద్దేవా చేశారు.
శిల్పా సహకర్ మూసివేస్తున్నారన్న ఆరోపణలను ఖండిస్తూ, ప్రజలు ఇతర చోట్ల కూడా కొనుగోళ్లు చేస్తున్నారని అన్నారు. మార్కెట్ యార్డు టెండర్లలో అందరికీ అవకాశం కల్పిస్తున్నారని, దానిని కూడా కక్షసాధింపు రాజకీయంగా చూపుతున్నారని భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి విమర్శించారు.
మార్కెట్ యార్డులో పార్టీ కార్యాలయం ఏర్పాటు అంశంపై శిల్పా చేసిన విమర్శలను ఖండించారు.
వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కర్నూలు =ూ రైల్వే సర్కిల్ సెంటర్లో ఏపీ ఆగ్రో సంబంధించిన 1. 60 సెల్లును పార్టీ కార్యాలయానికి కేటాయించారు కదా మరి దాన్ని ఎందుకు ప్రశ్నించలేదు ..
ప్రభుత్వ స్థలాలు అనేకం ఉండగా, పార్టీ కార్యాలయం ఎక్కడ ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ నిర్ణయమని పేర్కొన్నారు.

# ప్రశ్న రావణ్ అరెస్ట్ ప్రజాస్వామ్యంపై దాడి

## రాజకీయ కక్షసాధింపునకు పరాకాష్ట.

**..చట్టాన్ని ప్రతిపక్షాల గొంతు నొక్కే ఆయుధంగా మార్చవద్దు. -సీపీఐ జిల్లా కార్యదర్శి. ఎన్ రంగనాయుడు**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూలై 07:**
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించే గొంతులను అణచివేయాలనే రాజకీయ ఉద్దేశంతో ప్రశ్న రావణ్‌ను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలపై జరిగిన తీవ్ర దాడి అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు. ఎస్.బాబా ఫకృద్దీన్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.
ప్రభుత్వ విధానాలను, వైఫల్యాలను ప్రశ్నించే వారిపై రాజద్రోహం వంటి తీవ్రమైన కేసులు నమోదు చేసి అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శలను రాజకీయంగా ఎదుర్కోవాల్సింది పోయి, పోలీసు వ్యవస్థను ఉపయోగించి భయభ్రాంతులకు గురిచేయడం రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడేనని
అదే తరహా లేదా అంతకంటే తీవ్రమైన వ్యాఖ్యలు అధికార పార్టీ నాయకులు చేసినప్పుడు ప్రభుత్వం



స్పందించకపోవడం, ప్రతిపక్షాల విషయంలో మాత్రం చట్టాన్ని కఠినంగా అమలు చేయడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని విమర్శించారు.
అధికారంలో ఉన్నవారికి ఒక న్యాయం, ప్రతిపక్షాలకు మరో న్యాయం అమలు చేయడం రాజ్యాంగంలోని సమానత్వ సూత్రాన్ని అవమానించడమేనని
ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం నేరం కాదని, ప్రజల తరపున మాట్లాడే గొంతులను కేసులు, అరెస్టులతో అణచివేయాలని చేసే ప్రయత్నాలు చివరికి ప్రజాస్వామ్య వ్యవస్థనే బలహీనపరుస్తాయని భిన్నాభిప్రాయాలను చర్చతో ఎదుర్కొనే బదులు నిర్బంధాలతో సమాధానం చెప్పడం అధికార అహంకారానికి నిదర్శనమని అన్నారు. ప్రశ్న రావణ్‌పై నమోదు చేసిన కేసులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, రాజకీయ కక్షసాధింపుతో కొనసాగుతున్న వేధింపులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని అధికార పార్టీకి రక్షణ కవచంగా, ప్రతిపక్షాలకు శిక్షా ఆయుధంగా ఉపయోగించే ధోరణిని వెంటనే విరమించుకోవాలని
ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడం ప్రతి ప్రభుత్వ రాజ్యాంగబద్ధ బాధ్యత అని పేర్కొన్న ఆయన, ప్రశ్నించే హక్కును గౌరవించి ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుగుణంగా ప్రభుత్వం వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

# కేరళ,గోవా తరహాలోనే బీచ్ షాక్స్

**ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**
**సామాన్య పర్యాటకులకు దూరంగా ఏర్పాటు**
**ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి**

**రాజమండ్రి,జూలై 7 ఆంధ్ర ప్రగతి**
కేరళ, గోవా తరహాలో రాష్ట్రంలో బీచ్ షాక్స్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర వివరించారు. టూరిజం అభివృద్ధిలో భాగంగా విశాఖపట్నం, సూర్యలంకలో ఫైవ్‌స్టార్ హోటల్స్ ద్వారా బీచ్ షాక్స్‌లో మద్యం విక్రయాలు నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు. మంగళవారం రంపచోడవరం మండలం పందిరి మామిడిలో నీరా ప్లాంటేషన్‌ను ప్రారంభించారు. పందిరిమామిడిలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా ఉద్యాన పరిశోధనా కేంద్రంలో ఏర్పాటు చేసిన తాటి ఉత్పత్తుల తయారీ పరిశ్రమను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్, ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ , గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబులతో కలిసి పరిశీలించడమైనది. నీరా, తాటి బెల్లం, తాటి పానకం



రుచి చూసి, యూనివర్సిటీ సమీపంలోని తాటి తోటలను పరిశీలించాము. అధికారులతో మాట్లాడి నీరా పరిశ్రమ, ఉప ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకోవడమైనది. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు. బీచ్‌లలో ఎవరికీ ఇబ్బంది లేకుండా నిర్మానుష్య ప్రదేశాల్లో బీచ్ షాక్స్ ఉంటాయని తెలిపారు. బీచ్ సాక్స్‌పై ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. టూరిజం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల్లో మాత్రమే ఇదో భాగమన్నారు. అక్టోబర్ నుంచి కొత్త ఎక్సైజ్ విధానం అమల్లోకి తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. మద్యం అధిక ధరల అమ్మకాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేస్తున్నారని అన్నారు. ఎమ్మార్పీకి మించి అమ్మితే మద్యం షాపులు సీజ్ చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.
ఇకపోతే దేశాన్ని, హిందూ మతాన్ని అవమానించిన వారిని జగన్ వెనకేసు కొస్తున్నారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.బీసీలను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యాఖ్యానించారు. జగన్ హయాంలో బీసీలకు ద్రోహం చేశారని దుయ్యబట్టారు. 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 24 శాతానికి తగ్గించారని చెప్పుకొచ్చారు. వైసీపీ హయాంలో 1,608 మంది బీసీలు పదవులు కోల్పోయారని తెలిపారు. వైసీపీ నేతలు బీసీ రౌండ్‌టేబుల్ పేరుతో కుట్రలు చేస్తున్నారని మంత్రి ఆగ్రహించారు. ఏపీకి పెట్టుబడులు రావడం జగన్‌కు ఇష్టం లేదని దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో జరిగిన రూ.3500 కోట్ల లిక్కర్ స్కాం దేశంలోనే పెద్దదని సుప్రీంకోర్టు చెప్పిందని అన్నారు. పనికిరాని బ్రాండ్లతో వేలకోట్లు దోచుకున్నారని ÷ర్ అయ్యారు. నాసిరకం మద్యంతో వేలమందిని పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. వైసీపీని అడ్రస్ లేకుండా చేస్తామని హెచ్చరించారు.

# జోసఫ్ రావణ్‌ను ఎలా సమర్థిస్తారు ?

**జగన్ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే కోటంరెడ్డి**

**నెల్లూరు,జూలై 7ఆంధ్ర ప్రగతి**
జోసఫ్ రావణ్ వంటి వ్యక్తిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమర్థించడం దుర్మార్గమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి విమర్శించారు. దేవుళ్ళ, పీఠాధిపతులపై జోసఫ్ రావణ్ తీవ్ర వ్యాఖ్యలు చేసినా జగన్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. జోసఫ్ రావణ్‌ను ఎందుకు సమర్థిస్తున్నారని నిలదీశారు. దేవుడిని నమ్మడం, నమ్మకపోవడం వ్యక్తిగత విషయమని, కానీ ఎవరికీ మత విశ్వాసాలను



అవమానించే హక్కు లేదన్నారు. జోసఫ్ రావణ్‌పై నమోదైన కేసులను న్యాయస్థానాలే తేల్చాలని, అలాంటి కేసులు పెట్టడం తప్పని ఎలా చెబుతారని జగన్‌ను ప్రశ్నించారు. జోసఫ్ రావణ్‌ను జగన్ సమర్థించడం దురదృష్టకరమని వ్యాఖ్యానించిన కోటంరెడ్డి, వైసీపీ అధ్యక్షుడిగా జగన్.. భారతీయులకు, అన్ని మతాల ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, గతంలో వైఎస్ భారతిపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకున్న విషయాన్ని ప్రస్తావించిన ఆయన, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కూడా జోసఫ్ రావణ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఎమ్మెల్యే కోటంరెడ్డి వివరించారు.

## రీ సర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం: కూర్మనాథ్



**ఆంధ్ర ప్రగతి పాణ్యం, జూలై 07:** ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వేలో రైతులను భాగ స్వాములను చేసి వారి సమక్షంలో సర్వే నిర్వహించాలని, రాష్ట్ర సర్వే సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టరు కోణంకి కూర్మనాథ్ ఆదేశించారు. మంగళవారం నంద్యాల జిల్లా పాణ్యం మండలం పాణ్యం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాణ్యం గ్రామానికి సంబందించి వీఆర్వో, సర్వేయర్ల లాగిన్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ సర్వే రోజున తప్పనిసరిగా సంబంధిత రైతులు ఉండాలన్నారు. పూర్తయ్యాక డాక్యుమెంటు వెరిఫికేషన్ ద్వారా హద్దుల నిర్ణయం వారి సమక్షంలో జరగాలన్నారు. ఇందులో పొరపాట్లు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి చేతికి సరైన కొలతలతో పాసుపుస్తకం ఇవ్వాలన్నారు. గతంలో నిర్వహించిన దానిలో అనేక లోపాలు ఉండడంతో 2.0 రీ సర్వే చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2800 బృందాలతో సర్వే చేయిస్తున్నామన్నారు.
కార్యక్రమంలో నంద్యాల డివిజన్ ఇన్స్పెక్టర్ అఫ్ సర్వయర్ విజయ కుమారి మండల తహసీల్దార్, సర్వే, రెవిన్యూ తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు గుడిపాటి సీతారాం

**విజయవాడజూలై 7 ఆంధ్ర ప్రగతి**
విజయవాడకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు గుడిపాటి సీతారాం జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీతారాం భార్య, యువ గాయని శ్రీలలిత



కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా గుడిపాటి సీతారాం మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ 'దేశమే ప్రథమం' అనే దృక్పథంతో పనిచేస్తున్నారని, ఆయన నాయకత్వ స్ఫూర్తితోనే తాను జనసేనలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు, పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.గుడిపాటి ఫౌండేషన్ ఛైర్మన్‌గా సీతారాం క్రీడలు, యువజన అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్లు నిర్వహిస్తూ క్రీడా రంగంలో తనదైన గుర్తింపు పొందారు. ఆయన చేరికతో కృష్ణా జిల్లాలో జనసేన పార్టీకి క్రీడా, వ్యాపార వర్గాల నుంచి మరింత మద్దతు లభిస్తుందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. సీతారాం పార్టీలో చేరడం పట్ల జనసేన శ్రేణులు, సోషల్ మీడియా వేదికగా అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మతాల మధ్య చిచ్చుకు వైసిపి యత్నం

**హిందువులపై విషం చిమ్ముతున్న ప్రశ్న రావణ్, ప్రకాశ్ రాజ్,జడ శ్రవణ్**
**వీరందరికి మద్దతుగా నిలుస్తున్న వైసిపి నేతలు**
**మబండిపడ్డ ఎపి సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద**

**విశాఖపట్నం,జూలై 7 ఆంధ్ర ప్రగతి**
మతాల మధ్య చిచ్చుపెట్టాలని వైసీపీ చూస్తోందని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి ఆరోపించారు. ప్రశ్న రావణ్, జడ శ్రవణ్ కుమార్, ప్రకాశ్ రాజ్.. ప్రతిరోజూ హిందువులపై విషాన్ని చిమ్ముతున్నారని మండిపడ్డారు. హిందూ వ్యతిరేకంగా ఉన్నవారందరికీ వైసీపీ న్యాయ సహాయం చేస్తోందన్నారు. మంగళవారం ఆయన



విశాఖలో మీడియాతో మాట్లాడుతూ.. హిందువుల పేర్లు పెట్టుకుని సనాతన ధర్మాన్ని కించపరిచేలా నటుడు ప్రకాశ్ రాజ్ మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువుల ఆరాధ్య దైవాలను కించపరిచే హక్కు ఎవరిచ్చారని స్వామీజీ ప్రశ్నించారు. ప్రభుత్వం.. తప్పులు చేస్తున్న వారిని చట్టప్రకారం అరెస్టు చేస్తుంటే అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. కరుణాకర్ రెడ్డి టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలో జరిగిన తప్పులను ఎత్తి చూపినందుకే తమను టా÷-గ్గ÷ట్ చేశారన్నారు. హిందూ మనోభావాలను దెబ్బతీస్తూ చేస్తున్న వ్యాఖ్యల వెనుక వైసీపీ కుట్ర ఉందని స్వామి శ్రీనివాసానంద ఆరోపించారు. తమిళనాడు సీఎం విజయ్‌పై స్వామి శ్రీనివాసానంద సరస్వతి ప్రశంసలు కురిపించారు. హిందూ ఆలయాల నుంచి వచ్చే నిధులను ఆలయాల అభివృద్ధి కోసమే వాడుతామని తమిళనాడు సీఎం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. విజయ్ నిర్ణయాన్ని తాము సంపూర్ణంగా స్వాగతిస్తున్నామని చెప్పారు. హిందూ ఆలయాల నిధులను ఇతర అవసరాల కోసం మళ్లించకూడదని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సీఎంలు కూడా తమిళనాడు సీఎం తీసుకున్న నిర్ణయమే తీసుకోవాలని స్వామీజీ కోరారు. ప్లాన్ ప్రకారమే సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లపై దాడులు చేస్తున్నారని హిందూ సంఘాల నేత తురగా శ్రీరామ్ అన్నారు. ఏపీలో రిజర్వేషన్ల జిహాద్ జరుగుతోందని ఆరోపించారు. రిజర్వేషన్లను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రిజర్వేషన్లు లాక్కునేవారి వెనుక నాయకులు ఉన్నారని వ్యాఖ్యానించారు. కొంతమంది యూట్యూబర్, జర్నలిస్టుల ముసుగులో హిందుత్వంపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్న రావణ్‌కు మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి మద్దతు ఇస్తున్నారంటే అర్థం ఏంటి అని శ్రీరామ్ ప్రశ్నించారు.
--------

## ఈ ఏడాది రాయలసీమకు ఎల్‌నినో దెబ్బ... మంత్రి అనిత ఉన్నతస్థాయి సమీక్ష

**విజయవాడజూలై 7 ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్‌పై ఎల్‌నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. దీని కారణంగా రాష్ట్రంలోని 11 జిల్లాల్లో, ముఖ్యంగా రాయలసీమలో, సాధారణం నుంచి తీవ్రస్థాయిలో వర్షపాతం లోటు నమోదైందని అధికారులు తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) ప్రధాన కార్యాలయంలో హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. నైరుతి రుతుపవనాల పనితీరు, ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ఈ సమావేశంలో చర్చించారు.ఎల్‌నినో కారణంగా రాయలసీమ జిల్లాలు తీవ్రంగా ప్రభావితమైనట్లు సమావేశంలో గుర్తించారు. ముఖ్యంగా శ్రీ సత్యసాయి, అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో తీవ్ర వర్షాభావం ఉండగా.. కర్నూలు, నంద్యాల, చిత్తూరు, కడప, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో సాధారణ లోటు నమోదైనట్లు అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో కరవు పీడిత మండలాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి అనిత అధికారులను ఆదేశించారు.మరోవైపు, విపత్తుల కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వరద ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ వంటి అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని, పోలీస్, అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్, ఏపీఎస్డీఆర్ఎఫ్ బృందాలు అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని మంత్రి అనిత దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో ఏపీఎస్డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.